సాక్షి
కాకినాడ

శనివారం । 27 । జనవరి । 2024



సత్యదేవునికి కేంద్ర ప్రసాద్‌ం లేనట్టేనా?

అంతన్నాడు.. ఇంతన్నాడే గంగరాజు... అనే సినిమా పాటలా తయారైంది అన్నవరం దేవస్థానానికి 'ప్రసాద్' స్కీం నిధులు ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి. - 8లో



రూ.50 వేల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి నామాల నాగేశ్వరరావు, సుజాత దంపతులు (విశాఖపట్నం) రూ.50 వేల విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు శుక్రవారం 10,950 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.30 అడుగులుగా నమోదైంది.

ఈ పయనం.. ప్రగతి తీరాలకు..



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా



గౌరవ వందనం చేస్తున్న పోలీసు దళాలు

- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ కృతికా శుక్లా
- జాతీయ జెండా ఆవిష్కరణ
- సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నామని వెల్లడి

కాకినాడ సిటీ: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ప్రగతి తీరాలకు జిల్లా పయనిస్తోందని కలెక్టర్ కృతికా శుక్లా వెల్లడించారు. కాకినాడలోని జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి గణతంత్ర వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంప్రదాయ పోలీస్ కవాతును తిలకించి, జాతీయ పతాకాన్ని ఎగురవేసి, వందనం చేశారు. ఈ వేడుకల్లో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో జిల్లా ఈ ఏడాది సాధించిన ప్రగతిని కలెక్టర్ కృతికా శుక్లా వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

అన్నదాతకు భరోసా

వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ పథకాల ద్వారా 1,80,434 మంది రైతులకు రూ.219 కోట్లు పెట్టుబడి సహాయం అందించాం. వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాల పథకం కింద 30,495 మంది రైతులకు రూ.5 కోట్ల వడ్డీ రాయితీ జమ చేశాం. పంటలు నష్టపోయిన 16,811 మంది రైతులకు వైఎస్సార్ పంటల బీమా పథకం కింద రూ.12 కోట్లు పరిహారం, 1,960 మందికి రూ.1.52 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందజేశాం. 56,267 మంది రైతులకు రూ.114 కోట్ల పంట రుణాలు అందించాం. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా 795 మంది రైతులకు లబ్ధి చేకూర్చాం. ఖరీఫ్‌లో 262 ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా 27,713 మంది రైతుల నుంచి 1,48,439 మెట్రిక్ టన్నుల ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేశాం. వైఎస్సార్ పశు నష్ట పరిహార పథకం ద్వారా 1,256 మంది పాడి రైతులకు రూ.2.15 కోట్లు అందించాం.

మత్స్యకారులకు మేలు

వేట నిషేధ కాలంలో ఉపాధి కోల్పోయిన 24,147 మంది మత్స్యకారులకు రూ.24.15 కోట్లు పంపిణీ చేశాం. ఓఎన్‌జీసీ కార్యకలాపాల వల్ల జీవనోపాధి కోల్పోయిన 7,050 మంది మత్స్యకారులకు నాలుగో విడతగా రూ.48.65 కోట్ల పరిహారం అందించాం. అమీనాబాద్ వద్ద రూ.360 కోట్లతో చేపట్టిన ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు 60 శాతం పూర్తయ్యాయి.

విద్యా వికాసం

ప్రభుత్వ విద్యా రంగ అభివృద్ధికి విశేష కృషి జరుగుతోంది. జగనన్న అమ్మ ఒడి నాలుగో విడతలో 1,86,708 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.280 కోట్లు జమ చేసింది. మన బడి నాడు–నేడు పథకం రెండో దశలో ఎంపిక చేసిన 882 పాఠశాలల్లో రూ.333 కోట్లతో అదనపు తరగతి గదులు, విద్యా వసతుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. 339 ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 20 వేల మంది విద్యార్థులకు బైజూస్ ప్రీమియం కంటెంట్ లోడెడ్ ట్యాబ్‌లు పంపిణీ చేశాం. పి.వెంకటాపురంలో రూ.28 కోట్లతో నిర్మిస్తున్న కేంద్రీయ విద్యాలయ పనులు 60 శాతం పూర్తయ్యాయి. రూ.222 కోట్లతో 25 ఎకరాల విస్తీర్ణంలో ఐఐఎఫ్‌టీ క్యాంపస్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

వైద్య రంగానికి ప్రాధాన్యం

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా 511 వైద్య శిబిరాలు నిర్వహించి 2,07,500 మందికి సేవలు అందించాం. 1,823 మందికి కేటరాక్ట్ ఆపరేషన్లు చేయించాం. 8,668 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశాం. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షలకు పెంచింది. 3.75 లక్షల మందికి ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశాం. 25,823 మంది పేదలు రూ.62.61 లక్షల విలువైన ఆరోగ్యశ్రీ ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. రూ.7.20 లక్షలతో కాకినాడ జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన కాథ్‌ల్యాబ్, ఐసీయూలను, రూ.7.50 కోట్లతో ఏర్పాటు చేసిన ట్రామా కేర్ సెంటర్‌ను, రూ.10 కోట్లతో ఏర్పాటు చేసిన ఎంఆర్ఐ యూనిట్‌ను ఇటీవలి కాకినాడ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కాకినాడ జీజీహెచ్‌లో 79 స్టాఫ్ నర్సు పోస్టులు భర్తీ చేశాం. రూ.103 కోట్లతో కాకినాడలో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యింది.

పారిశ్రామిక వెలుగులు

కాకినాడలో ప్రతిష్టాత్మకమైన సత్యదేవా ప్రింటింగ్ క్లస్టర్‌ను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత నవంబరులో వర్చువల్‌గా ప్రారంభించారు. కోన గ్రామం వద్ద రూ.2,124 కోట్ల పెట్టుబడితో 1,944 ఎకరాల విస్తీర్ణంలో 3 బెర్తులతో నిర్మిస్తున్న కాకినాడ గేట్‌వే పోర్టు ద్వారా 5,500 మందికి ఉపాధి లభించనుంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వివిధ రాయితీల కింద ఈ ఏడాది రూ.13.13 కోట్లు మంజూరు చేశాం.

వరించిన పురస్కారాలు

- ప్రసిద్ధ చేనేత కళా ఉత్పత్తి ఉప్పాడ జాంధాని చీరకు గత ఏడాది ప్రతిష్టాత్మకమైన వన్ డిస్ట్రిక్ట్ – వన్ ప్రొడక్ట్ జాతీయ అవార్డు అందుకున్నాం.
- రెడ్‌క్రాస్ సహాయనిధి సేకరణలో మన జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో, సైనిక సంక్షేమ నిధి సేకరణలో రెండో స్థానంలో నిలపడం ద్వారా రాష్ట్ర గవర్నర్ నుంచి అవార్డులు అందుకున్నాం.
- ఘన వ్యర్థాల నిర్వహణ విభాగం కింద స్మార్ట్ సిటీస్ అవార్డుల్లో కాకినాడ దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది.
- జిల్లాలో ఉత్తమ సేవలందించిన 91 మంది వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ సతీష్ కుమార్ ప్రశంసా పత్రాలు అందించారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

సంక్షేమానికి పెద్దపీట



గణతంత్ర వేడుకల్లో ప్రసంగిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

- కొత్తగా వైఎస్సార్ పింఛన్ కానుక మంజూరైన 3,891 మందితో కలిపి మొత్తం 2,87,321 మందికి ప్రతి నెలా ఇంటి వద్దనే రూ.85.19 కోట్లు పంపిణీ చేస్తున్నాం.
- వైఎస్సార్ ఆసరా పథకం కింద 37,525 స్వయం సహాయక సంఘాలకు నాలుగో విడతగా రూ.300 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది.
- 15,827 స్వయం సహాయక సంఘాలకు రూ.1,196 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలుగా ఇప్పించాం.
- వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద రూ.45.25 కోట్ల రాయితీని 34,585 సంఘాలకు అందించాం.
- వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల కింద 2,010 మంది వధువుల తల్లుల ఖాతాల్లో రూ.14.09 కోట్లు జమ చేశాం.
- జగనన్న చేదోడు, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పథకాల ద్వారా 69,086 మందికి రూ.97.35 కోట్ల ఆర్థిక సహాయం అందించాం.
- వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా 2,778 మంది చేనేత కార్మికులకు రూ.6.67 కోట్లు పంపిణీ చేశాం.
- ఉపాధి హామీ పథకం ద్వారా ఇప్పటి వరకూ 2.15 లక్షల మందికి ఉపాధి కల్పించాం.
- జల్ జీవన్ మిషన్ ద్వారా 3,18,334 కుళాయిలు ఏర్పాటు చేశాం. 60 గ్రామాల్లో నూరు శాతం ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయడం హర్ ఘర్ జల్ గ్రామాలుగా ప్రకటించాం. మరో 19 గ్రామాలు ఇందుకు సిద్ధమవుతున్నాయి.
- జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకం ద్వారా ఇప్పటి వరకూ 271 గ్రామాల్లో సమగ్ర సర్వే పూర్తి చేసి, 1,33,894 మంది రైతులకు భూ హక్కు పత్రాలు జారీ చేశాం.
- రూ.8.51 కోట్ల ఎంపీ లాడ్స్ నిధులతో 119 అభివృద్ధి, రూ.2.26 లక్షల సీఎస్ఆర్ నిధులతో 31 సామాజిక పనులు, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కింద గుర్తించిన 2,650 ప్రజావసర పనులను రూ.108 కోట్లతో నిర్వహిస్తున్నాం.
- కాకినాడలో రూ.65 కోట్లతో నిర్మించిన ముత్తా గోపాలకృష్ణ రైల్వే ఓవర్ బ్రిడ్జిని, రాజా ట్యాంకు ఆవరణలో రూ.9.50 కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ స్కేటింగ్ రింక్‌ను, రూ.20 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించిన రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్ కళాక్షేత్రం ఆడిటోరియాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు.

న్యూస్‌రీల్

100 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణ



కలెక్టరేట్‌లో 100 అడుగుల జాతీయ జెండాను ఎగురవేస్తున్న జాయింట్ కలెక్టర్ ఇలక్కియ

కాకినాడ సిటీ: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో వంద అడుగుల ఎత్తు జాతీయ జెండాను జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్‌ఓ కె.శ్రీరమణి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహానికి జేసీ, డీఆర్‌ఓ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులకు, పాఠశాల విద్యార్థులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో సీపీఓ పి.త్రినాథ్, సివిల్ సప్లయిస్ డీఎం డి.పుష్పమణి, డీఎస్‌ఓ బీవీ రాజు, వికాస పీడీ కె.లచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో హైటీ



హైటీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కాకినాడ సిటీ: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా శుక్రవారం హైటీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ వంగా గీత, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, డీఆర్‌ఓ కె.శ్రీరమణి, కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, కాకినాడ, పెద్దాపురం ఆర్‌డీఓలు ఇట్ల కిషోర్, జె.సీతారామారావు తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు, సంగీత కచేరీలు అలరించాయి.

ఏపీఎస్పీలో ఘనంగా గణతంత్ర వేడుకలు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న డీఐజీ విజయరావు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో గణతంత్ర వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఏపీఎస్పీ గ్రౌండ్‌లో జాతీయ జెండాను కమాండెంట్, డీఐజీ సీహెచ్ విజయరావు ఎగురవేసి, వందనం చేశారు. సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏపీఎస్పీ హైస్కూల్ విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి.

పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌గా కనకారావు

పిఠాపురం: పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.కనకారావును నియమిస్తూ మున్సిపల్ పరిపాలన, అభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ కమిషనర్‌గా పని చేస్తున్న కృష్ణవేణిని తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు బదిలీ చేశారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఈ బదిలీలు జరిగాయి.

ఉత్తమ సేవలకు పురస్కారాలు



కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలను అందుకుంటున్న, పాఠశాల విద్య ఆర్‌జేడీ జి.నాగమణి, వైద్య సేవల రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పద్మ శశిధర్, వ్యవసాయ, సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎంఎస్ రంగనాయకులు



జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, ప్రభుత్వాసుపత్రుల సేవల కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.స్వప్న, డీఆర్‌డీఏ డీపీఎం టి.బాబూరావు, వాణిజ్య పన్నుల శాఖ అధికారి స్వామి

కాకినాడ సిటీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన 88 మంది అధికారులు, ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారాలను కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ ఇలక్కియ అందజేశారు. ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న వారిలో డాక్టర్ పద్మ శశిధర్ (రీజినల్ డైరెక్టర్, మెడికల్ సర్వీసెస్), డాక్టర్ ఎస్.లావణ్య కుమారి (కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్), డాక్టర్ ఎస్.స్వప్న (ప్రభుత్వాసుపత్రుల సేవల జిల్లా కో ఆర్డినేటర్), వై.శ్రీనివాస్ (ఏపీ హౌసింగ్ కార్పొరేషన్), జి.నాగమణి (పాఠశాల విద్య ఆర్‌జేడీ, డీఈఓ), ఎంఎస్ రంగనాయకులు (వ్యవసాయ, సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్), ఎం.నాగార్జున (పర్యావరణం, ఫారెస్ట్, సైన్స్ అండ్ టెక్నాలజీ), సీహెచ్ఏయు రవికుమార్ (హ్యాండ్‌లూమ్ అండ్ టెక్నాలజీ), టి.బాబూరావు (డీఆర్‌డీఏ డీపీఎం) తదితర జిల్లా అధికారులు ఉన్నారు. వీరితో పాటు రెవెన్యూ శాఖ నుంచి 9, పోలీస్ శాఖలో 8 మందికి, ఏపీఎస్పీ, వ్యవసాయ, పశు సంవర్ధక, ఈపీడీసీఎల్ నుంచి ఇద్దరు చొప్పున, పాఠశాల విద్య నుంచి ముగ్గురు, సచివాలయ ఉద్యోగులు 8 మంది, వైద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ నుంచి 14 మందికి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ – అర్బన్ డెవలప్‌మెంటు నుంచి 8 మందికి, పంచాయతీరాజ్ నుంచి 8 మందికి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ నుంచి ఇద్దరికి, సోషల్ వెల్ఫేర్, హౌసింగ్, బీసీ వెల్ఫేర్, ఏపీఎస్ ఆర్టీసీ, బీసీ వెల్ఫేర్, హార్టికల్చర్, ఇండియన్ రెడ్‌క్రాస్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎండోమెంట్, ఎన్విరాన్‌మెంట్, సెరికల్చర్ డిపార్టుమెంట్ల నుంచి ఒక్కొక్కరికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

మువ్వన్నెల సుమాలు విరబూసినట్టు..

- గణతంత్ర వేడుకల్లో అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు
- ఆకట్టుకున్న ప్రభుత్వ శకటాల ప్రదర్శన



ప్రథమ బహుమతి గెలుచుకున్న గృహనిర్మాణ సంస్థ శకటం



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యప్రదర్శన

కాకినాడ సిటీ: గణతంత్ర వేడుకలు జరిగిన వేళ.. కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్.. జాతీయ జెండాను పోలిన మూడు రంగుల సుమాలు విరబూసినట్టుగా కనువిందు చేసింది. మన మాతృదేశం గొప్పతనాన్ని, స్వాతంత్ర్య సమర యోధుల త్యాగనిరతిని కళ్లకు కట్టినట్టుగా.. నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఎంతో అలరించాయి. జాతీయతా స్ఫూర్తిని చాటి చెప్పాయి. కాకినాడ జగన్నాథపురం చర్చి స్క్వేర్ మున్సిపల్ బాలికల పాఠశాల, కోటనందూరు కస్తూర్బా గాంధీ విద్యాలయ(కేజీబీవీ), కాకినాడ సాలిపేట మున్సిపల్ కార్పొరేషన్ బాలికల పాఠశాల, రాయుడుపాలెం ఉమా మనోవికాస కేంద్రం, గాంధీనగర్ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కోటనందూరు కేజీబీవీ, సాలిపేట మున్సిపల్ కార్పొరేషన్ బాలికల పాఠశాల విద్యార్థులకు సంయుక్తంగా ప్రథమ బహుమతి అందించారు. జగన్నాథపురం చర్చి స్క్వేర్ మున్సిపల్ బాలికల పాఠశాల విద్యార్థులు ద్వితీయ, గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులు తృతీయ, ఉమా మనోవికాస కేంద్రం విద్యార్థులు ప్రత్యేక బహుమతి అందుకున్నారు. వీరికి కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్ బహుమతులు అందించారు.

12 రకాల శకటాలు

వేడుకల్లో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధిని ప్రతిబింబించేలా శకటాలను ప్రదర్శించారు. అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయ అభివృద్ధి, విద్య (ఇంగ్లిష్ మీడియంలో బోధన, రైజ్ కార్యక్రమం), జిల్లా నీటి యాజమాన్య సంస్థ (ఉపాధి హామీ పథకం, వైఎస్సార్ జలకళ), పౌర సరఫరాల శాఖ, సంస్థ (ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు, ఎండీయూ వాహనం), డీఆర్‌డీఏ (వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులు, చేయూత మహిళా మార్టు), మహిళా అభివృద్ధి – శిశు సంక్షేమ శాఖ (మహిళా శక్తి), అటవీ శాఖ (వన్యప్రాణుల సంరక్షణ), గృహ నిర్మాణ సంస్థ (నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకం కింద గృహాలు, ప్లాట్లు), జిల్లా ఎన్నికల విభాగం (ఓటు హక్కు వినియోగంపై ప్రజా చైతన్య ప్రచార రథం), వైద్య, ఆరోగ్య శాఖ (108, 104 సేవలు), రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శకటాలను ప్రదర్శించారు. వీటిలో జిల్లా గృహ నిర్మాణ సంస్థకు ప్రథమ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మహిళా అభివృద్ధి – శిశు సంక్షేమ శాఖలు సంయుక్తంగా ద్వితీయ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ – కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్లు సంయుక్తంగా తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నాయి. గణతంత్ర వేడుకల సందర్భంగా పోలీస్, ఎన్‌సీసీ, రెడ్‌క్రాస్ దళాలు నిర్వహించిన కవాతు ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో ఉత్తమ కవాతుగా హోం గార్డ్ కంటెస్టెంట్, ద్వితీయ బహుమతి 3వ ఆంధ్రా ఎన్‌సీసీ బాలికల బెటాలియన్, రెడ్‌క్రాస్ సంస్థలకు కలెక్టర్, ఎస్పీ అందజేశారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా ఉద్యాన, మైక్రో ఇరిగేషన్, సెరికల్చర్, వ్యవసాయం, గ్రామీణ నీటిసరఫరా, పశు సంవర్ధక, మత్స్యశాఖల ఆధ్వర్యాన స్టాళ్లు ఏర్పాటు చేశారు. వీటిలో వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యాన శాఖలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నాయి.

విఘ్నేశ్వరుని సన్నిధిలో షణ్ముఖశర్మ



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో సామవేదం షణ్ముఖశర్మ దంపతులు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారిని ప్రముఖ ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ శుక్రవారం సతీ సమేతంగా దర్శించుకున్నారు. షణ్ముఖ శర్మ దంపతులకు సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి ఆలయ విశిష్టతను షణ్ముఖశర్మకు ఆలయ వేదపండితులు వివరించారు. వేదమంత్రాలతో షణ్ముఖశర్మ దంపతులను సత్కరించి స్వామివారి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

క్లుప్తంగా

ఆవుల అక్రమ రవాణా అడ్డగింపు



ఆవుల అక్రమ రవాణాపై విచారిస్తున్న పోలీసులు

అమలాపురం టౌన్: స్థానిక నల్లా వీధిలో ఓ వ్యాన్‌లో మూడు ఆవులను అక్రమంగా రవాణా చేసేందుకు ఇద్దరు వ్యక్తులు శుక్రవారం ఉదయం ప్రయత్నిస్తున్న సమయంలో విశ్వ హిందూ పరిషత్, బజరంగదళ్ కార్యకర్తలు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు నల్లా వీధికి చేరుకుని ఆవుల యాజమానులపై విచారణ జరిపారు. తాత్కాలికంగా ఆ మూడు ఆవులను స్థానిక గోశాలకు తరలించారు. ఆవులను అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. వారిద్దరూ ఆవులను రామచంద్రపురం తీసుకుని వెళుతున్నామని కొద్దిసేపు. ద్రాక్షారామ తరలిస్తున్నామని మరికొద్ది సేపు పొంతన లేని సమాధానాలు చెప్పారు. పట్టణ సీఐ క్రిష్టోఫర్ ఆధ్వర్యంలో పోలీసులు ఈ ఘటనపై విచారణ చేస్తున్నారు. బజరంగ దళ్ రాష్ట్ర సహ కన్వీనర్ శిరంగు నాయుడు, విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు ఊటుకూరి సాంబయ్య, కర్రి పార్థసారథి, మేడిశెట్టి సతీష్, పిచ్చుక సుబ్బారావు ఆవుల అక్రమ రవాణాపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ



ప్రయాణికురాలికి వస్తువులు అందజేస్తున్న డీఎం రామన్నదొర, కండక్టర్ చంద్రశేఖర్

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపో కండక్టర్ దాకమూరి చంద్రశేఖర్ విధి నిర్వహణలో తన నిజాయితీ చూపించారు. గోకవరం ఆర్టీసీ డిపోకు చెందిన మండపేట ఆర్టీసీ సర్వీసులో గురువారం తుంగపాడుకు చెందిన ముచ్చిక గన్నెమ్మ సుమారు 60 వేలు విలువ గల రెండు జతల చెవి దుద్దులు, వెండి పట్టీలను బస్సులో పాగొట్టుకుంది. బస్సులో వీటిని గుర్తించిన కండక్టర్ చంద్రశేఖర్ భద్రపరిచి డిపో మేనేజర్ యు.రామన్నదొరకు అందజేశారు. శుక్రవారం వస్తువులు పోగొట్టుకున్న గన్నెమ్మను డిపోకు రప్పించి ఆ వస్తువులను ఆమెకు అందజేశారు. విధి నిర్వహణలో తన నిజాయితీ చూపించిన కండక్టర్ చంద్రశేఖర్‌ను డీఎం రామన్నదొర, అసిస్టెంట్ డీఎం అద్దాల అప్పారావు, తోటి ఉద్యోగులు అభినందించారు.

సత్యదేవునికి కేంద్ర ప్రసాద్‌ం లేనట్టేనా?

- నెల రోజుల్లో ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం
- ఈలోపు సాధ్యం కాదంటున్న అధికారులు

అన్నవరం: అంతన్నాడు.. ఇంతన్నాడు గంగరాజు... అనే సినిమా పాటలా తయారైంది అన్నవరం దేవస్థానానికి 'ప్రసాద్' స్కీం నిధులు ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి. పదేళ్లుగా దేవస్థానం అధికారులను ఊరిస్తూ రూ.96 కోట్లు ఇస్తామని చివరకు రూ. పది కోట్లు ఇస్తాం అనే పరిస్థితికి తీసుకువచ్చారు. త్వరలో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే పరిస్థితుల్లో ఆ నిధులు కూడా ఇచ్చే పరిస్థితి లేదని సమాచారం. నిధులిస్తే ఈ పాటికే విడుదల చేసేవారని రాష్ట్ర టూరిజం శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఎనిమిదేళ్ల క్రితమే అన్నవరం దేవస్థానం ఎంపిక

కేంద్ర ప్రభుత్వం దేశంలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్ని అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన పిలిగ్రిమేజ్ రీజువినేషన్



ప్రసాద్ స్కీం లోగో

అండ్ స్పిర్చ్యువల్ అగ్మంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) స్కీం కింద దాదాపు ఎనిమిదేళ్ల క్రితమే ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానాన్ని ఎంపిక చేసింది. కొండమీద, కొండదిగువన భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు వివిధ నిర్మాణాల ప్రతిపాదనలు పంపమని కోరింది. దేవస్థానం అధికారులు రూ.96 కోట్లకు ప్రతిపాదనలు పంపించారు. 2020లో ప్రతిపాదనలను రూ.54 కోట్లకు కుదించి మళ్లీ ప్రతిపాదనలు పంపించాలని



ప్రసాద్ స్కీం డీపీఆర్‌పై ఉత్తర్వులివ్వాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత, దేవస్థానం అధికారులు (ఫైల్)

ఆదేశించగా దేవస్థానం అధికారులు ఆ విధంగా పంపించారు. రెండు నెలల క్రితం రూ.పది కోట్లు మాత్రమే ఇస్తాం...దానికి తగ్గట్టుగా ప్రతిపాదనలు పంపించమన్నారు. నిరాశకు లోనైన దేవస్థానం రూ.పది కోట్లతో అన్నదాన భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించింది. అలా పంపించిన ప్రతిపాదనలపై ఇంతవరకు ఎటువంటి సమాచారం అటు రాష్ట్ర టూరిజం శాఖ అధికారులకు కాని, అన్నవరం దేవస్థానానికి కాని రాలేదు.

ఎదురు తెన్నులు

డీపీఆర్ ప్రకారం వెంటనే నిధులివ్వాలని 2021లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కాకినాడ ఎంపీ వంగా గీత, ఎంఎల్ఏ పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్, అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ తదితరులు కలిసి విజ్ఞప్తి చేశారు. అయినా ఫలితం లేదు. కేంద్రం నుంచి ప్రసాద్ స్కీం నిధులు అన్నవరం దేవస్థానానికి విడుదల అయ్యే అవకాశం దాదాపుగా లేదనే చెప్పాలని రాష్ట్ర టూరిజం శాఖ ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ నెలలోనే జీఓ విడుదల అవ్వాలి. నిధులు విడుదల అవ్వాలి. టెండర్లు పిలవాలి, టెండర్లు ఖరారు కావాలి. ఇదంతా ఈ నెల రోజుల్లో జరగడం సాధ్యం కాదని వారు అభిప్రాయపడుతున్నారు.

మహారాష్ట్ర టు పూరీ



అనంతపల్లి వద్ద బైపాస్ రహదారిపై ఆగిన సైకిల్ యాత్ర బృందం

- 1,650 కిలోమీటర్ల సైకిల్ యాత్ర
- రోజుకు 125 కిలోమీటర్ల ప్రయాణం

నల్లజర్ల: ఆంధ్రా ప్రకృతి అందాలు ఆకట్టుకున్నాయని మహారాష్ట్ర నుంచి జగన్నాథపురికి వెళ్తున్న సైకిల్ యాత్ర బృందం పేర్కొంది. బైపాస్ రహదారిపై వెళ్తూ అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు అమోల్ బిల్వాల్‌కర్, దీపక్ బిల్వార్, వైభవ్‌గురుసలే, ఉమాంగ్‌పటవ్‌ర్, టేజాస్ గురుసలే, రాజేంద్ర బోస్లేలు మాట్లాడుతూ తాము ఈ నెల17వ తేదీన మహారాష్ట్రలోని కరేడ్ జిల్లా సతారనుంచి బయలు దేరి 28వ తేది నాటికి ఒడిశా వెళ్లి పూరీ జగన్నాథస్వామిని దర్శించుకోనున్నట్టు వివరించారు. యువత దురలవాట్లకు లోనవడం వల్ల భక్తిభావం తగ్గుతోందని ఇలా సైకిల్‌పై వెళ్తూ యువతలో ఆధ్యాత్మికతను పెంపొందించే దిశగా వివరిస్తూ ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. రోజు 125 కిలోమీటర్లు ప్రయాణం చేస్తున్నట్టు వివరించారు. మార్గమధ్యలో ఆంధ్రా అందాలు ఎంతగానో ఆకట్టుకున్నాయని, ఇక్కడి ప్రజల ఆప్యాయతలు చాలా బాగున్నాయన్నారు. ఆగినచోట ఏదైనా హోటల్ ఉంటే అక్కడే శాకాహారం భోజనం, రోటీలు తింటున్నామన్నారు. రాత్రివేళ సమీపంలో గుడి లేదా బడి వద్ద విశ్రమిస్తున్నట్టు చెప్పారు. తామంతా మిత్రులమని చిన్న,చిన్న వ్యాపారాలు చేస్తున్న తామంతా ఎక్కడికి వెళ్లిన బృందంగానే వెళతామని చెప్పారు. వీరికి బీజేపి జిల్లా ఉపాధ్యక్షులు శెట్టిపల్లి శివనాగరాజు ఆంధ్రా పిండివంటలు పార్శిల్ అందజేశారు.

నవ్విపోదురు గాక

- ఓటర్ల జాబితాపై 'ఈనాడు' తప్పుడు కథనం
- వాస్తవాన్ని వక్రీకరించి తప్పుదారి పట్టించే యత్నం

ఫ్యాక్ట్ చెక్

కాకినాడ: లేనిది ఉన్నట్టుగా, అబద్ధాలను నిజాలుగా ప్రచారం చేయడంలో ఆరితేరిన 'ఈనాడు' పత్రిక మరోసారి తన నైజాన్ని బయటపెట్టుకుంది. ఓటర్ల తుది జాబితాలో లేని లోపాలను ఎత్తి చూపిస్తూ ప్రజలను ఏమార్చేందుకు మరోసారి ప్రయత్నించింది. 'ఉన్నోళ్లను తొలగించి... లేనోళ్లను కొనసాగించి' శీర్షికన శుక్రవారం నాటి సంచికలో ఓ తప్పుడు కథనాన్ని ప్రచురించింది. ఓటర్ల జాబితాను తప్పుల తడకగా చూపించేందుకు పడరాని పాట్లు పడింది. సదరు పత్రికలో వచ్చిన కథనాన్ని పరిశీలిస్తే దాదాపు అన్నీ అవాస్తవాలేనని తేలింది.

ఓట్లు తొలగించలేదు... ఇదిగో ఆధారం

కాకినాడకు చెందిన మండిల్లి ధనేంద్ర ఓటును అకారణంగా 'డిలిట్' చేసినట్టు కథనం రాశారు. వాస్తవానికి 123వ పోలింగ్‌స్టేషన్ నుంచి 121 పోలింగ్ స్టేషన్‌కు తన ఓటును బదలాయించాల్సిందిగా ధర్మేంద్రే స్వయంగా దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఆయన ఓటును 121వ పోలింగ్‌స్టేషన్‌కు మార్పు చేశారు. నిబంధనల ప్రకారం ఫారం–8 ద్వారా షిఫ్టింగ్ కోరితే ముందు పోలింగ్ స్టేషన్‌లో ఒక పీఎస్ నుంచి మరో పీఎస్‌కు ఓటు మారి పాత పోలింగ్‌స్టేషన్‌లో డిలీట్ చేసి కొత్త పోలింగ్ స్టేషన్‌లో ఓటును జత చేస్తారు. ఇక్కడా అదే జరిగింది. ఆ మేరకు 121వ పోలింగ్‌స్టేషన్‌లో 1,346 సీరియల్ నంబర్‌తో ఓటు స్పష్టంగా కనిపిస్తోంది. అయితే వాస్తవాన్ని పక్కన పెట్టి కథనాన్ని రాసేశారు. ఇక మండవిల్లి రామకృష్ణ కుటుంబ సభ్యుల ఓట్లను కూడా ఇదే పద్ధతిలో ఒక పోలింగ్‌స్టేషన్ నుంచి మరో పోలింగ్‌స్టేషన్‌కు మార్పు చేశారు. సీరియల్ నంబర్లు 1,375, 1,376గా నమోదయ్యాయి. ఇమ్మనేని సత్యవతి కూడా 123వ స్టేషన్ నుంచి 115వ పోలింగ్‌స్టేషన్‌కు మార్చుకున్నారు (సీరియల్ నెంబర్ 1,034). నిబద్ధతతో పనిచేసే ఎన్నికల సిబ్బంది మనోస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఈనాడులో కథనాలు రాస్తున్నారంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు మరణ ధృవపత్రం లేనిదే ఓట్లను తొలగించే అవకాశం లేని పరిస్థితుల్లో ఆయా కుటుంబ సభ్యుల నుంచి సహకారం లేకపోవడంతో అక్కడక్కడా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు తుది జాబితాలో దర్శనమిచ్చాయి. దీనిని కూడా బూద్దతంలో చూపించే ప్రయత్నం ఈనాడు చేస్తోంది.



ఓట్లు డిలీట్ చేశారంటూ ఈనాడులో వచ్చిన కథనం



వేరొక పోలింగ్‌స్టేషన్‌లోకి మార్పు చేసిన ఓటు

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

తుని: రైలు నుంచి జారిపడి గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని తుని జార్పీ ఎస్సై ఎస్కే అబ్దుల్ మారూఫ్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 23న గొల్లప్రోలు–పిఠాపురం రైల్వేస్టేషన్ల మధ్యలో గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి 40–42 వ్యక్తి తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ అంపైర్‌గా శ్రీనివాసరావు



అమలాపురం టౌన్: భారత క్రీడా మంత్రిత్వ శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో చెన్నైలో జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు అమలాపురం కొంకాపల్లికి చెందిన బ్యాడ్మింటన్ నేషనల్ అంపైర్ పాయసం శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు అందుకున్నానని శ్రీనివాసరావుకు తెలిపారు. 6వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ దక్షిణ భారతదేశంలో తొలిసారిగా జరుగుతున్నాయి. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కలిపి 36 టీమ్‌లు పాల్గొంటున్నాయి. 26 క్రీడా విభాగాలలో పోటీలు జరిగే ఈ క్రీడా సంగ్రామాన్ని ఈనెల 19న తేదీన చెన్నైలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారు. బ్యాడ్మింటన్ పోటీలు ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకూ జరుగుతాయి. శ్రీనివాసరావు అయినవిల్లి మండలం నల్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శ్రీనివాసరావు గతంలో థామస్ ఉబర్ కప్, ఇండియన్ ఓపెన్ టోర్నీకి మూడు సార్లు, స్కూల్ గేమ్స్ వరల్డ్ ఛాంపియన్ షిప్, నేషనల్ గేమ్స్, పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి టోర్నమెంట్లకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు.

పులి జాడలపై నిపుణుల పరిశీలన



పుల్లలపాడు రిజర్వు ఫారెస్ట్‌లో పులి జాడలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

నల్లజర్ల: పుల్లలపాడు రిజర్వు ఫారెస్ట్‌లో పులి సంచారంపై అటవీశాఖ అధికారులు శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిశీలించారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసరు వేణుగోపాల్ ఆధ్వర్యంలో పులి అడుగు జాడలంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో నిపుణులను తీసుకువచ్చి పీఓపీ టెస్ట్‌లు చేయించారు. ఇవి పులి జాడలు కావని ఏవైనా అడవి జంతువు(హైనా)ల జాడలు కావొచ్చునని భావిస్తున్నట్టు వేణుగోపాల్ తెలిపారు. పుల్లలపాడు జీడిమామిడి తోటల నుంచి అయ్యవరం వైపు జాడలు కనిపించాయని ఆ దిశగా పరిశీలన చేస్తున్నట్టు చెప్పారు. పులి ఈ ప్రాంతంలో సంచరిస్తే ఎక్కడో ఒకచోట పశువులు, మేకలు, గొర్రెల మందలపై దాడి చేస్తుందని, ఎక్కడ అటువంటి సంఘటనలు కానరాలేదన్నారు. వదంతులు నమ్మవద్దని ఆయన స్థానికులకు విజ్ఞప్తి చేశారు.

29న నిధి ఆప్‌కే నికత్

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈ నెల 29వ తేదీన ఉదయం 9.00 గంటల నుంచి నిధి ఆప్‌కే నికత్–డిస్ట్రిక్ట్ ఔట్ రీచ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్టు అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ వైడి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో హుకుంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలోను, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం రోహిణి హాస్పిటల్‌లోను, కాకినాడ జిల్లాలో కాకినాడ శ్రీసాయిఆయిల్ ఫీల్డ్ సర్వీసెస్‌లోను, ఏలూరు జిల్లాలో ఏలూరు రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్ దగ్గరగల బీఎస్ఎన్ఎల్ భవన్‌లోను, పశ్చిమగోదావరిజిల్లా పాలకొల్లు మండలం పూలపల్లి ఎలిమ్ ఎడ్యుకేషనల్ అకాడమిలోను, అల్లూరి సీతారామరాజుజిల్లాలో వై.రామవరం మండలం వై.రామవరం గ్రామపంచాయతీ కార్యాలయంలోను, గంగవరం మండలంలో మొల్లేరు పీఏసీఎస్(సొసైటీ)లోను, మారేడుమిల్లి మండలం మారేడుమిల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలోను ఈ ప్రోగ్రామ్‌లు జరుగుతాయన్నారు. ఉద్యోగుల పొదుపు ఆధారిత బీమా పథకం(ఈడీఎల్ఐ)పై ఈ నిధి ఆప్‌కే నికత్ నిర్వహిస్తామన్నారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ బకాయి ఉన్న పింఛనుదారులు, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడానికి ఈ క్యాంపును సందర్శించవచ్చన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ పురోహిత క్రికెట్ టోర్నమెంట్ మూడో రోజు శుక్రవారం ఉత్సాహంగా సాగింది. విజయవాడ జట్టుపై వైజాగ్, అన్నవరంపై ఖమ్మం, కొవ్వూరుపై విజయవాడ, గుంటూరుపై ఖమ్మం అయ్యప్ప సీసీ జట్టు, భీమవరంపై వైజాగ్ జట్టు తలపడగా విజయవాడ, అన్నవరం, విజయవాడ, ఖమ్మం, వైజాగ్ జట్లు విజయం సాధించాయి. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌ను అన్నవరం జట్టు నుంచి సుబ్బారావు, వైజాగ్ జట్టు నుంచి విశ్వనాథ్, ఖమ్మం అయ్యప్పసీసీ సంతోష్, విజయవాడ నుంచి సాయి దక్కించుకున్నారు. నిర్వాహకులు కర్రా బాబి, విజయ్, గండికోట సాయి, మహేంద్ర, అక్షయ్ వీరిని అభినందించారు. బ్రాహ్మణ సంఘ జిల్లా నాయకులు నిమీషకవి పుల్లయ్య శర్మ చేతుల మీదుగా మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డును అందజేశారు.

మహనీయుల విగ్రహాలు ప్రతిష్టను పెంచుతాయి

మండపేటలో అంబేద్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్ తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): మహనీయులైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలు మండపేట ప్రతిష్టను పెంచుతాయని రాష్ట్ర ఎస్సీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జూపూడి ప్రభాకరరావు అన్నారు. మండపేటలో శుక్రవారం నిర్వహించిన మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి పినిపే విశ్వరూప్ అంబేడ్కర్ విగ్రహాన్ని, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన నిర్వహించిన సభలో వక్తలు మహనీయుల త్యాగాలను కొనియాడారు. అమలాపురం ఎంపీ చింతా అనూరాధ, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోసు, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయేలు, పండుల రవీంద్రబాబు మాట్లాడుతూ భారతీయులంతా గర్వించతగిన మహనీయులు అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ అన్నారు. మండపేట పట్టణంలో విగ్రహాలను నెలకొల్పిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును అభినందించారు. మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలకు చెందిన ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ నాయకులు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం రోజున మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించడం గర్వించతగినదన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ దళితవాడలకే పరిమితమైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను మండపేట నడిబొడ్డులోని ప్రధాన రహదారిలో తన హయాంలో నెలకొల్పడం ఆనందంగా ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడవడం వల్ల తనకు ఈ అవకాశం దక్కిందన్నారు. విగ్రహాలను ఏర్పాటు చేయాలని దళితులు అనేక సంవత్సరాలుగా విజ్ఞప్తి చేస్తుండగా స్థానిక పెత్తందారీ వ్యవస్థ అడ్డుపడుతూ వచ్చిందన్నారు. విగ్రహాల ఏర్పాటుకు మున్సిపల్ కౌన్సిల్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సామాజిక వర్గాల నాయకులు చేసిన కృషి మరువలేనిదన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు వేగుళ్ళ పట్టాభిరామయ్య చౌదరి, పిల్లి గణేశ్వరరావు, మందపల్లి రవికుమార్, దళిత నాయకులు పాల్గొన్నారు.